# ఖాకీకి అవినీతి చెదలు

- లంచావతారులుగా మారిన కొందరు ఎస్సైలు
- విచ్చలవిడిగా వసూళ్లు.. ఇవ్వకపోతే బెదిరింపులు
- అధికారాన్ని అడ్డంపెట్టుకుని ఆగడాలు
- ఏసీబీకి పట్టుబడుతున్నా మారని తీరు
- ఉమ్మడి జిల్లాలో ఇటీవల ఏసీబీకి చిక్కిన వారెందరో..
- తాజాగా పట్టుబడిన లింగంపేట ఎస్సై, రైటర్



ఏసీబీ అధికారులకు పట్టుబడిన లింగంపేట ఎస్సై, రైటర్


లింగంపేట, నవంబర్ 14: అవినీతి అధికారులతో పోలీసు శాఖ పరువు మంటగలుస్తున్నది. కొందరు అక్రమార్కుల కారణంగా డిపార్ట్‌మెంట్ మొత్తం ప్రజల్లో పలుచనవుతున్నది. తప్పుచేసిన వారితో ఊచలు లెక్కించే పోలీసులే లంచాలకు మరిగి జైలుపాలవుతున్న ఘటనలు ఉమ్మడి జిల్లాలో ఇటీవల తరచూ వెలుగుచూస్తున్నాయి. స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు డబ్బు తీసుకుంటూ వర్ని ఎస్సై కృష్ణకుమార్ ఇటీవల రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడిన సంగతి తెలిసిందే. తాజాగా అదే తరహాలో స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు డబ్బులు డిమాండ్ చేసిన లింగంపేట ఎస్సై అరుణ్ కూడా చేసి ఏసీబీ వలలో చిక్కడం కలకలం రేపింది. ఈ నేపథ్యంలో పోలీసు శాఖలో వేళ్లూనుకున్న అవినీతి పర్వం మరోమారు చర్చనీయాంశమైంది.

### స్టేషన్ బెయిల్ ఇచ్చేందుకు..

లింగంపేట మండలంలోని ఓ గ్రామానికి చెందిన కొందరు రెండు నెలల క్రితం విందు చేసుకున్నారు. ఈ క్రమంలో అక్కడ జరిగిన ఘర్షణలో ఒకరికి గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అయితే, అతడిని కోర్టులో హాజరుపరచుకుండా ఎస్సై డబ్బులు తీసుకుని, తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు తెలిసింది. అంతటితో ఆగకుండా బైండోవర్ చేసినందున కచ్చితంగా స్టేషన్ బెయిల్ తీసుకోవాలని పోలీసులు సూచించినట్లు సమాచారం. స్టేషన్ బెయిల్ ఇవ్వడానికి భారీగా డబ్బులు డిమాండ్ చేయగా, రూ.10 వేలకు ఒప్పందం కుదిరింది. లంచం ఇవ్వడానికి అంగీకరించని నిందితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఏసీబీ అధికారుల సూచన మేరకు గురువారం మధ్యాహ్నం పోలీసుస్టేషన్‌లో రైటర్ రామస్వామికి డబ్బులు ఇస్తున్న సమయంలో అక్కడే మాటువేసి ఉన్న అధికారులు దాడి చేసి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎస్సై అరుణ్ ఆదేశాల మేరకే రైటర్ డబ్బులు తీసుకున్నట్లు గుర్తించి ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై, కానిస్టేబుల్‌ను అరెస్టు చేసి, హైదరాబాద్ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేకకోర్టులో హాజరుపరచనున్నట్లు నిజామాబాద్ ఏసీబీ డీఎస్పీ శేఖర్‌గౌడ్ తెలిపారు. దాడిలో ఏసీబీ ఇన్‌స్పెక్టర్లు వేణుకుమార్, నగేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అరుణ్‌పై ఆరోపణలెన్నో..

లింగంపేట ఠాణాపై ఏసీబీ దాడులు జరగడం, ఎస్సై అరుణ్ ఏసీబీకి చిక్కడం స్థానికంగా కలకలం రేపింది. మూడు నెలల క్రితం సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో వీఆర్‌లో ఉన్న అరుణ్ బదిలీపై లింగంపేటకు వచ్చారు. దీపావళి సందర్భంగా బాణాపూర్ గ్రామ శివారులోని పౌల్ట్రీ ఫామ్‌లో పేకాడుతూ పట్టుబడిన ఓ మాజీ ప్రజాప్రతినిధి భర్తను ఎస్సై డబ్బులు తీసుకుని కేసు నుంచి తప్పించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.లింగంపల్లి శివారులోని అటవీ ప్రాంతంలో పేకాటరాయుళ్లను స్పెషల్ పార్టీ పోలీసులు పట్టుకుని స్థానిక పోలీసులకు అప్పగించగా, వారి వద్ద నుంచి సైతం భారీగా డబ్బులు డిమాండ్ చేసి తీసుకున్నట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఎస్సై ఏసీబీకి చిక్కాడన్న వార్త తెలిసి స్టేషన్‌కు వచ్చిన కొందరు పేకాటరాయుళ్లు తమ ఉసురు తగిలిందని హర్షం వ్యక్తం చేయడం గమనార్హం.







### ఇసుకలోనే తిష్ట వేసుకుని..

బిచ్కుంద, బీర్కూర్ శివారుతో పాటు మద్నూర్, పిట్లం, నస్రుల్లాబాద్, బాన్సువాడ, నిజాంసాగర్, డోంగ్లి మండలాల్లో ఇసుక అక్రమ దందా భారీగా జరుగుతున్నది. రాత్రి కాగానే గద్దల్లా వాలిపోయి మంజీరా నుంచి ఇసుకను తోడేస్తున్నారు. బాన్సువాడ డివిజన్‌లో ఓ సీఐపై అనేక ఆరోపణలున్నాయి. నిజామాబాద్ కమిషనరేట్‌లో పని చేసిన సమయంలోనే సిద్దిపేటకు ట్రాన్స్‌ఫర్ కాగా, ఓ ఎమ్మెల్యేకు సామాజిక వర్గం పేరుతో దగ్గరై కీలక పోస్టింగ్ దక్కించుకున్నట్లు ప్రచారం జరుగుతున్నది. స్థానిక లీడర్ పేరు చెప్పి ఇసుక దందాకు మద్దతుగా నిలుస్తున్నట్లు ఆరోపణలున్నాయి. మహారాష్ట్ర సరిహద్దులో పని చేసే ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ తీరుపైనా అనేక విమర్శలున్నాయి. సర్కిల్ పరిధిలో పని చేస్తున్న పలువురు ఎస్సైలు వాహనాల సామర్థ్యాన్ని బట్టి రేట్లు ఫిక్స్ చేసి వసూళ్లకు తెగబడుతున్నట్లు చెబుతున్నారు. పైనుంచి వచ్చిన ఆదేశాలంటూ విచ్చలవిడిగా రెచ్చిపోతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. భారీ వాహనాల్లో టన్నుల కొద్దీ ఇసుకను తీసుకుని ఠాణా గేట్ల ముందు నుంచే దర్జాగా వెళ్తున్నప్పటికీ పోలీసులు పట్టించుకోవడం లేదు. లోపాయికారీ ఒప్పందంలో భాగంగానే ఖాకీలు కండ్లు మూసుకుంటున్నట్లు స్థానికులు చెబుతున్నారు. కీలక నేతల ఆదేశాలతో హస్తం పార్టీ లీడర్ల టిప్పర్లు, లారీలు, ట్రాక్టర్లు దర్జాగా ఇసుకను తరలించుకు పోతున్నాయి. ఎవరైనా స్థానికులు ఫిర్యాదు చేస్తే స్పందించని కొందరు పోలీసులు.. ఫిర్యాదు చేసిన వ్యక్తినే బెదిరింపులకు గురిచేస్తుండడంతో అక్రమాలను ఎదురించేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

### ఇసుకాసురులకు మద్దతుగా ..

బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల్లోని మంజీరా నది పరీవాహక ప్రాంతంలో ఇసుక అక్రమ దందా జోరుగా నడుస్తున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సర్కారు ఆదాయానికి గండికొడుతూ భారీగా దండుకుంటున్నారు. ఇందుకు ప్రోత్సహిస్తున్న వారిలో రెవెన్యూ, మైనింగ్, టీజీఎండీసీ అధికారులతో పాటు పోలీసులు సైతం ప్రధాన పాత్ర పోషిస్తున్నారు. అధికార పార్టీ నేతల ద్వారా 'ఆదాయం వచ్చే స్థానాల్లో' పోస్టింగ్‌లు తెచ్చుకున్న కొందరు పోలీసు అధికారులు.. అక్రమ ఇసుక దందాకు పరోక్ష మద్దతుగా నిలుస్తూ దండుకుంటున్నారు. ఇదంతా బహిరంగంగానే జరుగుతున్నప్పటికీ కామారెడ్డి పోలీసులపై ఈగ వాలకపోవడం అనేకు అనుమానాలకు తావిస్తున్నది. వారిని కాపాడుతున్నదెవరనే చర్చ ఇప్పుడు జోరుగా సాగుతున్నది.

### నిఘా మరిచారా...?

నిజామాబాద్ కమిషనరేట్‌లో ఇసుక అక్రమార్కులను నిలువరించని కారణంగా పలువురు పోలీసులపై కన్నేసిన నిఘా వర్గాలు సమగ్ర నివేదిక రూపొందించి ఉన్నతాధికారులకు సమర్పించారు. ఎవరెవరు ఎంతెంత మొత్తంలో మామూళ్లు తీసుకుంటున్నారో పూసగుచ్చినట్లు డీజీపీకి వివరాలు సమర్పించాయి. అయితే, కామారెడ్డిలో పెద్ద ఎత్తున జరిగే ఇసుక దందాలో పాత్రధారులుగా నిలుస్తున్న పోలీసులపై నిఘా పెట్టక పోవడంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. తెలంగాణ వ్యాప్తంగా మల్టీ జోన్ 1, మల్టీ జోన్ 2లో ఇసుక అక్రమ వ్యవహారంలో పోలీసుల పాత్రను నిగ్గు తేల్చి చర్యలు తీసుకుంటున్నారు. కామారెడ్డిలో మాత్రం అలాంటిదేమీ లేకపోవడం విస్మయం కలిగిస్తున్నది. ఖాకీలకు ఖద్దరు అండగా నిలుస్తుండడమే ఇందుకు కారణమన్న ప్రచారం జరుగుతున్నది.

# అవినీతిపరులను కాపాడుతున్నదెవరు?

నిజామాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా పోలీసు శాఖలో అవినీతి జలగల ఆట కట్టించకపోవడం అనేక విమర్శలకు తావిస్తున్నది. నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలో అక్రమాలకు పాల్పడుతున్న 12 మందిని గుర్తించిన ఉన్నతాధికారులు వారిపై చర్యలకు సిద్ధమయ్యారు. కానీ, కామారెడ్డి జిల్లాలో రెచ్చిపోతున్న కొందరు ఖాకీలపై కన్నేయకపోవడం విస్మయానికి గురిచేస్తున్నది. కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధూ శర్మనే నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీగా కొనసాగుతున్నారు. నిజామాబాద్‌లో కళంకితులను గుర్తిస్తుండగా, కామారెడ్డిలోనూ అలాంటి వారిపై విచారణ చేపట్టకపోవడం వెనుక ఉన్న ఒత్తిళ్లు ఏమిటన్నది అంతుచిక్కని ప్రశ్నగా మారింది. అధికార పార్టీ నేతల సిఫారసుతో పోస్టింగ్‌లు తెచ్చుకున్న వారు విచ్చలవిడిగా రెచ్చిపోతున్నా వారి విషయంలో చూసీచూడనట్లు వ్యవహరిస్తుండడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. రాజకీయనేతల ఒత్తిడికి భయపడి చర్యలకు వెనుకాడుతున్నారనే అపవాదును కామారెడ్డి జిల్లా పోలీసులు మూటగట్టుకుంటున్నారు.

# ఫ్లెక్సీ తెచ్చిన వివాదం

- ఆర్మూర్‌లో ప్రొటోకాల్ రగడ
- ఎంపీ, ఎమ్మెల్యే ఫొటో లేదని బీజేపీ నేతల ఆగ్రహం
- కాంగ్రెస్, కాషాయ పార్టీ నేతల మధ్య వాగ్వాదం



ఘటనా స్థలం వద్ద కాంగ్రెస్, బీజేపీ నాయకుల వాగ్వాదం

ఆర్మూర్‌టౌన్, నవంబర్14: ఫ్లెక్సీ తెచ్చిన వివాదం ఉద్రిక్తతకు దారి తీసింది. కాంగ్రెస్, బీజేపీ నేతల మధ్య వాగ్వాదం, తోపులాటకు కారణమైంది. ఆర్మూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు పర్యటన సందర్భంగా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో ఎంపీ, ఎమ్మెల్యే ఫొటో పెట్టక పోవడంతో మొదలైన ప్రొటోకాల్ వివాదం రెండు పార్టీల నాయకులు నెట్టివేసుకునే దాకా వెళ్లింది. జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి నిజామాబాద్ జిల్లాలో గురువారం పర్యటించారు. ధాన్యం సేకరణ, సమగ్ర కుటుంబ సర్వే జరుగుతున్న తీరును పరిశీలించారు. మంత్రి రాక సందర్భంగా పెర్కిట్‌లోని కొనుగోలు కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో నిజామాబాద్ ఎంపీ అర్వింద్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఫొటోలు పెట్టక పోవడంపై బీజేపీ శ్రేణులు ఆగ్రహానికి లోనయ్యాయి.

అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులపై మండిపడ్డారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ నేతలు కల్పించుకోవడంతో వివాదం మొదలైంది. ఫ్లెక్సీని చించేందుకు బీజేపీ నాయకులు ప్రయత్నించగా, అధికార పార్టీ నేతలు అడ్డుకన్నారు. ఈ క్రమంలో ఒక్కసారిగా ఘర్షణ జరిగి ఉద్రిక్తత తలెత్తింది. అక్కడే ఉన్న పోలీసులు ఇరు వర్గాలను సముదాయించేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. గొడవ జరుగుతుండగానే బీజేపీ శ్రేణులు ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి ఫొటోలు లేని ఫ్లెక్సీలను చించి వేశారు. ఆర్మూర్ ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డి రెండు పార్టీల నాయకులను సముదాయించి నచ్చజెప్పడంతో వివాదం సద్దుమణిగింది. మరోవైపు, ప్రొటోకాల్ పాటించని అధికారులపై ఎమ్మెల్యే రాకేశ్‌రెడ్డి సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

# పోస్టాఫీస్ లోపల ఎస్పీఎం.. బయట తాళం

- మృతిచెందిన కుమారుడి పేరిట ఖాతాలో ఉన్న డబ్బులు ఎస్పీఎం ఇవ్వకపోవడంతో తండ్రి ఆగ్రహం
- రూ. 4 వేలు లంచం డిమాండ్ చేశాడని ఆరోపణ



పోస్టాఫీసు లోపల ఉన్న ఎస్పీఎంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న నేనావత్ కమల్‌నాయక్, పోస్టాఫీసుకు బయటి నుంచి వేసిన తాళం

ఎల్లారెడ్డి రూరల్, నవంబర్ 14 : నాలుగేండ్ల క్రితం మృతిచెందిన తన కుమారుడి పేరుపై పోస్టాఫీస్ ఖాతాలో ఉన్న ఉపాధి హామీ కూలీ డబ్బులు ఇవ్వక.. ఇబ్బందులకు గురిచేస్తున్న ఎస్పీఎం (సబ్ పోస్టుమాస్టర్)పై తండ్రి ఆగ్రహం వ్యక్తంచేశాడు. తన కుమారుడి కష్టార్జితం నుంచి రూ.4 వేలు లంచం ఇస్తేనే డబ్బులు ఇస్తానని ఎస్పీఎం అనడం.. నిబంధనల ప్రకారం అన్ని పత్రాలు సమర్పించినా ఆరునెలల నుంచి తిప్పుతుండడంతో విసుగుచెందిన మృతుడి తండ్రి.. ఎస్పీఎంను లోపలే ఉంచి పోస్టాఫీసుకు గురువారం తాళం వేశాడు.

ఇందుకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎల్లారెడ్డి మండలంలోని జిత్యాతండాకు చెందిన నేనావత్ రాందాస్ నాలుగేండ్ల క్రితం మృతిచెందాడు. అతడి పేరుపై పోస్టాఫీసు ఖాతాలో జమ ఉన్న ఉపాధిహామీ కూలీ డబ్బులు రూ.7,900 తీసుకోవడానికి ఫార్మాలిటీస్ అన్ని పూర్తిచేసినప్పటికీ ఎస్పీఎం అంబర్‌సింగ్ డబ్బులు ఇవ్వకుండా వివిధ కారణాలు చెబుతూ తిప్పుతున్నాడని మృతుడి తండ్రి నేనావత్ కమల్‌సింగ్ ఆవేదన వ్యక్తం చేశాడు. పోస్టాఫీసు ఖాతాలోని రూ. 7,900 ఇవ్వడానికి రూ. 4 వేలు లంచం ఇవ్వాల్సిందిగా ఎస్పీఎం డిమాండ్ చేసినట్లు ఆరోపించాడు. దీంతో విసుగుచెందిన నేనావత్ కమల్‌సింగ్.. ఎస్పీఎం లోపల ఉన్న సమయంలోనే పోస్టాఫీస్‌కు తాళం వేసి, వాగ్వాదానికి దిగాడు. స్థానికులు సముదాయించడంతో సుమారు గంట అనంతరం పోస్టాఫీసు తాళం తీశాడు.

ఈ విషయమై ఎస్పీఎం అంబర్‌సింగ్‌ను వివరణ కోరగా.. నేనావత్ కమల్ సింగ్‌కు విషయం అర్థం కాకపోవడంతో తాళం వేశాడని, సర్వర్ ప్రాబ్లం ఉండడంతోనే డబ్బులను ఇవ్వలేదని, తనపై నింద వేయడం, ఆఫీస్‌కు తాళం వేయడం సరి కాదని అన్నారు.

# నేడు నృసింహుడి రథోత్సవం



భీమ్‌గల్ మండలకేంద్రంలోని లింబాద్రిగుట్టపై శ్రీలక్ష్మీ నర్సింహ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 8వ రోజు గురువారం డోలా సేవా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. జోడు లింగమునకు వెళ్లే దారిలో ఉన్న సీతా నగరంలోని నాలుగు స్తంభాల రాతి మండపంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నేడు రథోత్సవం (జాతర) నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

– భీమ్‌గల్, నవంబర్ 14

# త్వరలో ఎస్పీ బదిలీ?

## హైదరాబాద్‌కు వెళ్లేందుకు వినతి



నిజామాబాద్, నవంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : కామారెడ్డి జిల్లా ఎస్పీ, నిజామాబాద్ ఇన్‌చార్జి సీపీ సింధూశర్మ త్వరలో బదిలీ కానున్నట్లు సమాచారం. వ్యక్తిగత కారణాలతో హైదరాబాద్‌కు బదిలీచేయాలని ఆమె ప్రభుత్వానికి విన్నవించుకున్నట్లు విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది. సింధూశర్మ ఏడాదిగా కామారెడ్డి ఎస్పీగా పనిచేస్తున్నారు. కామారెడ్డి జిల్లా ఏర్పాటు తర్వాత తొలి ఎస్పీగా శ్వేతారెడ్డి పనిచేశారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి విధులు నిర్వహించారు. కామారెడ్డికి మూడో ఎస్పీగా వచ్చిన సింధూశర్మ పోలీసు శాఖపై తనదైన ముద్రవేశారు. అయితే, వ్యక్తిగత కారణాల రీత్యా తనను హైదరాబాద్‌కు బదిలీ చేయాలని విజ్ఞప్తి పెట్టుకున్నట్లు తెలిసింది. ఆమె కోరికను ప్రభుత్వం మన్నించే అవకాశాలున్నట్లు సమాచారం. ఆమె స్థానంలో ఎవరిని నియమిస్తారన్నది ఇప్పుడు పోలీసు శాఖలో చర్చనీయాంశంగా మారింది. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కల్మేశ్వర్ సింగెనవార్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం.. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు. కామారెడ్డి ఎస్పీ సింధూశర్మకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగించారు. నెలన్నర రోజులు గడిచిపోయినప్పటికీ నిజామాబాద్ సీపీని ఇంతవరకు నియమించలేదు. అదే సమయంలో కామారెడ్డి ఎస్పీ బదిలీకి విన్నవించడంతో.. రెండు జిల్లాలకు ఒకేసారి పోలీస్ ఉన్నతాధికారులను నియమించే అవకాశముంది.